ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు

సంపుటి : 10 సంచిక : 15 పుష్యం : 31-32 20-04-2005



రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్ష పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 8/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


02-01-05
కైకలూరు .................. 1

09-02-05
మురమళ్ళ.................. 9



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-01-05, కైకలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

గాఢనిద్రలో మనకు దేహాభిమానం ఉండదు. అలాగే జాగ్రదవస్థలో దేహాభిమానం లేకుండా మనం ఉండగలగాలి. ఎందుచేతనంటే దేహాభిమానం ఉన్నంతకాలం దేహాలు వస్తూనే ఉంటాయి, దానిని ఎవరూ నివారించలేరు. దేహాభిమానం నశించటానికి యజ్ఞభావనతో పనిచేయమని భగవంతుడు చెపుతున్నాడు. యజ్ఞభావనతో పని చేయటం వలన మనం పవిత్రులం అవుతాము, ఏకాగ్రత వస్తుంది, దేహబుద్ధి నశిస్తుంది. ద్రవ్యయజ్ఞం, తపోయజ్ఞం, జపయజ్ఞం, జ్ఞాన యజ్ఞం ఇవి అన్నీ యజ్ఞాలు. అధ్యయనం చేయటంలోగాని, ప్రవచనం చేయటంలోగాని అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు. నువ్వు జాగ్రత్తగా అధ్యయనం చేయాలి, దానిని అర్థం చేసుకోవాలి, నువ్వు చెప్ప గలిగితే ఇతరులకు నీ అనుభవాలను పంచగలగాలి. అది కూడా యజ్ఞం. కాలం స్పీడుగా వెళ్ళిపోతూ ఉంటుంది, కాలాన్ని మనం ఆపలేము, కాల ప్రవాహంలో మన శరీరం కూడా కొట్టుకొనిపోతుంది. అందుచేత ఈ శరీరం ఉండగానే మనం జాగ్రత్తపడాలి, శరీరం పోయినతరువాత మనం చేసేది ఏమీలేదు. ఈ దేహం భూమిమీద తిరుగాడుతున్నప్పుడే మనో దేహములను సద్వినియోగం చేసుకొని తత్వాన్ని తెలుసుకోమని, తత్వ జ్ఞానంలో ఆనందాన్ని అనుభవించమని పెద్దలు చెపుతున్నారు. నిన్ను నీవు తెలుసుకోకుండా ఏదో ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? మిగిలిన విషయాల గురించి తొందరపడకు, చేద్దువుగాని ముందు నిన్ను నీవు తెలుసుకో. నిన్ను నీవు తెలుసుకోకుండా ప్రపంచం గురించి తెలుసు కొంటే అది ఒకటిలేని సున్నలతో సమానము, ఇది అర్థం చేసుకోండి.

నువ్వు ఎవడివో నీకు తెలియదు, ఈ భూమి మీదకు ఎందుకు వచ్చావో తెలియదు, ప్రపంచం గురించి తెలుసుకొంటాను, ప్రపంచాన్ని ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి? మనం ఎవరిమో మనం తెలుసుకొనేవరకు మనకు స్వేచ్ఛలేదు, స్వాతంత్ర్యం లేదు. తత్వం తెలిసేవరకు మనకు శాంతి లేదు, సుఖం లేదు, ఆనందం లేదు. అప్పటివరకు మనస్సు ఎటుగంతులు వెయ్యమంటే అటు గంతులు వేస్తాము. అహంకారం ఉన్నవాడికి స్థిరత్వం ఉండదు. పాపం, పుణ్యం, ఈ బాధలు, సంతోషాలు ఇవి అన్నీ అహంకారానికే. అది లేనివాడికి ఏదీ లేదు. ఎందుచేతనంటే అహంకారం నశించిన వెంటనే నారాయణుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. దుమ్ము దులుపుకొన్నట్లు ఈ ప్రకృతిని దులిపేసుకో, జీవలక్షణాలను వదిలించుకో. అహంకారాన్ని నేను కల్పించలేదు, అది నువ్వే కల్పించుకొన్నావు అందుచేత ప్రయత్నం చేసి దానిని వదిలించుకో. నీవు ప్రయత్నం చేస్తూఉంటే నా సహకారం నీకు అందుతుంది.

మీరు పూజ చేయాలంటే, హోమాలు చేయాలంటే ఖర్చు అవుతుంది, ఒక్క పైసా కూడా ఖర్చు లేనిది జపయజ్ఞం. మీరు హాయిగా కూర్చుని మీకు ఇష్టమైన భగవంతుని నామాన్ని జపించుకోండి, అది శ్రద్ధగా చేయండి, ప్రేమగా చేయండి. మీరు పవిత్రులవుతారు. మన మనస్సు విజృంభిస్తూ ఉంటుంది. మనస్సు యొక్క విజృంభణను ఆపుచేసి, మనస్సును ఎండగట్టటమే తపస్సు. మనం ఏదో చూస్తూ ఉంటాము, ఏదో విషయాలను ఆలోచిస్తూ ఉంటాము, అది మనకు కావాలి అనిపిస్తుంది. వాటిని చూసేది, వాటి గురించి ఆలోచించేది, నాకు కావాలి అని చెప్పేది మనస్సే. వాటికోసం ప్రయత్నం చేసేది, వాటిని అనుభవించేది మనస్సే. మనస్సును తీసివేస్తే ఏమీ లేదు. దరిద్రం బయట ఏమీలేదు దరిద్రం అంతా మనస్సులోనే ఉంది, ఇది మీరు అర్థం చేసుకోండి. మన లోపల ఉన్నదే బయట కనిపిస్తోంది కాని లోపల లేనిది బయట కనబడదు. మనస్సు నశిస్తే మనం మిగులుతాము అంటే మనం ఏదిగా ఉన్నామో అది మనకు ఎరుకలోనికి వస్తుంది, అది తత్వజ్ఞానం. బయట విషయాలనుండి మనం సంతోషం అనుభవిస్తూ ఉంటే అది అంతా ఏదో రోజున దుఃఖంగా మారిపోతుంది. రూపబుద్ధి, నామబుద్ధి తప్పనిసరిగా మనకు దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. నీకు అహంభావన ఉంది. నీవు చేసే చెడ్డకు ఫలితం రాకూడదు అంటే ఎలా కుదురుతుంది, తప్పనిసరిగా వచ్చి తీరుతుంది. జపాలు చేసేవారు అందరూ మేం జపం చేస్తున్నాము, మేం జపం చేస్తున్నాము అంటున్నారు కదా. మరి నేను చేస్తున్నాను అనుకొన్నప్పుడు పుణ్యం వస్తుంది. నేను చేస్తున్నాను అనే బుద్ధి లేకపోతే పుణ్యం లేదు. నేను చేస్తున్నాను అనే కర్తృత్వబుద్ధి ఉన్నప్పుడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించాలి. నువ్వు ఏదైనా ఇచ్చేటప్పుడు ఇవ్వటం కోసమే ఇవ్వాలి, ప్రేమతో ఇవ్వాలి అంతేగాని అక్కడ ఏదో ప్రయోజనం ఆశించి

ఇస్తే మటుకు అది దానం కాదు, ఒకవేళ అది నువ్వు దానం అనుకొన్నా అది రాక్షసదానం. నీకు ఇవ్వాలని ఉందా ఇచ్చి మర్చిపో అంతేగాని లోపల ఏదో ప్రయోజనం పెట్టుకొని నువ్వు మంచిపని చేసినా అది దానం కింద రాదు. యజ్ఞదానతపస్సుల వలన నీవు పవిత్రుడవు అవుతావు, మనస్సు నియమింపబడుతుంది, అది హృదయాకారం చెందుతుంది. యజ్ఞ దాన తపస్సులను నీవు ప్రాణంపోయే వరకు విడిచిపెట్టవద్దు అని పరమాత్మ చెప్పాడు, అంటే మనోనాశనం అయ్యేవరకు వాటిని విడిచిపెట్టకూడదు. మనం ఏదైనా మంచి చేయాలి అనుకొన్నప్పుడు చేసి వదిలివేయటమే, ఫలితం కోసం ఎదురు చూడవద్దు, అది భగవంతుడు నిర్ణయిస్తాడు. ఎవడికైతే కర్తృత్వబుద్ధి ఉందో వాడుజన్మ రాహిత్యాన్ని పొందలేడు. ఏదో యోగం ద్వారా మనస్సును తీసుకొనివెళ్ళి హృదయంలో ప్రవేశపెట్టాలి. హృదయంలో ఉంటేనేగాని మనస్సు నశించదు. జాగ్రదవస్థలో సర్వసాధారణంగా మనస్సు ఎక్కువసేపు శిరస్సులో ఉంటుంది, దానిని తీసుకొని వెళ్ళి హృదయంలో నిలబెట్టటం అలవాటు చేయాలి.

మనం కోరిక లేకుండా, స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే పూర్వపు వాసనలు తగ్గుతాయి, కొత్త వాసనలు రావు. మనం ఏ పని చేసినా కోరికతో చేస్తాము, కోరికతో పనిచేసామంటే వాసన పడితీరుతుంది, ఆ వాసన మరల మనచేత పని చేయిస్తుంది, ఇదే కర్మచక్రం. ఎవడో మహాత్ముడు, మహాగురువు, జ్ఞాని, అవతారపురుషుడు యొక్క దయలేకుండా ఈ కర్మచక్రంలో నుండి మనం బయటపడే అవకాశం లేదు. ఎండ్రిన్ కొంచెం ఎక్కువ తాగితే శరీరం చనిపోతుంది. చాలా కొంచెం పుచ్చుకొన్నాము అనుకోండి అది శరీరాన్ని చంపకపోయినా, శరీరానికి ఎంతో కొంత చెడ్డ చేస్తుంది. అలాగే మనకు పెద్ద పెద్ద చెడుతలంపులు రాకపోయినా, ఆ చెడుతలంపులు చిన్నవి అయినా కూడా అవి మనస్సులోనికి వెళ్ళి మనస్సును పాడుచేస్తాయి. నీకు మహర్షులతోటి, మహాత్ములతోటి, జ్ఞానులతోటి సహవాసం మంచిది. ఎందుచేతనంటే వారి సమక్షంలో మనస్సుకు హృదయాభిముఖంగా ప్రయాణం చేయటం అలవాటు అవుతుంది. జ్ఞాని చేసేపని మౌనంగానే చేస్తాడు, ఏదైనా అవసరమయితే మాట్లాడతాడు. మనం అవసరం లేకపోయినా మాట్లాడతాము, అహంభావన కోసం మాట్లాడతాము. దీనివలన వ్యక్తిభావన పెరుగుతుంది, దేహాభిమానం పెరుగుతుంది, చివరకు ఇదంతా మనకు దుఃఖానికి కారణం అవుతుంది. ఎవడికైతే జ్ఞాన సిద్ధి కలిగిందో, ఎవడైతే ఆత్మస్థితిని పొందాడో వాడి ద్వారా మౌనంగానే పని జరిగిపోతుంది. అక్కడ మాటలతో పనిలేదు, అక్కడ నీ ప్రయత్నంతో సంబంధం లేకుండానే మనస్సు యొక్క చాపల్యం ఆగిపోవటం ప్రారంభిస్తుంది, అది జ్ఞాని యొక్క ఔన్నత్యం. మనం ఏమి చేస్తాము అంటే ఏదయినా ఒక పని ఇష్టంతో చేస్తాము, అది మనకు ఎప్పటికయినా అపకారం చేస్తుంది

అని మనకు తెలియదు. ఏదో ఉపకారం అని చేస్తాము చివరకు వచ్చేటప్పటికి అది అపకారం అవుతుంది. ఆ వాసనను తొలగించుకోవటానికి మరల ప్రయత్నం చేస్తాము. కాళ్ళు బాడి చేసుకోవటం కడుక్కోవటం ఇదే పని మనకు, ఇలా కాలాన్ని వృధాచేసుకోవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. నన్ను ప్రమాణంగా తీసుకో. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అని ఆలోచించుకొంటూ కూర్చొంటే పుణ్యకాలం కాస్తా అయిపోతుంది. జీవుడికి ఏది మంచిదో, ఏది చెడ్డదో అనేది ఋషులు అనుభవించి మనకు చెప్పారు. వాటిని ప్రమాణంగా తీసుకో. నీ శరీరయాత్రకు సరిపడ పని చేసుకొంటూ మిగతాకాలం అంతా నువ్వు ఏదైతే అయిఉన్నావో దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేసుకో. దానిని తెలుసుకోలేదు అనుకో నువ్వు జీవితంలో చాలా నష్టపోతావు, మరణించిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి.

నీ మనస్సును ప్రమాణంగా పెట్టుకోవద్దు, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. నీ గురువుతోటి, భగవంతుడితోటి, భగవంతుడు చెప్పిన వాక్యంతోటి మానసికఅనుబంధం పెట్టుకో. మిమ్మల్ని అహంకారం పెట్టుకోమని, గర్వం తెచ్చుకోమని నేను చెప్పలేదు, ప్రకృతిని చూసి నేర్చుకొంటున్నారు. అసలు మనకు ఉన్న చదువు ఎంత? తెలివి ఎంత? మొన్న సునామీ అని వచ్చింది, వేలాదిమంది చనిపోయారు. సైన్సు పెరిగిపోయింది అంటున్నారు, దానిని ఆపుచేయటం మాట వదలండి, అసలు అది వస్తోందని కూడా అర్థం కాలేదు. సునామీ వచ్చింది సముద్రం ఒడ్డున ఉన్నవారు పోయారు, మనకు ఏమీ పరవాలేదు అనుకోవద్దు. పంచభూతాలు విజృంభించకుండా ఉంటేనే మనం ఏదో అలా కొద్దికాలం ఉంటాము, అవి విజృంభిస్తే ప్రళయం వస్తే మొత్తం అంతా ముంచేస్తుంది. వేదకాలంనాటి ఋషులు ప్రకృతిని శోధించి, మానవ స్వభావాన్ని శోధించి చెప్పిన విషయాల సారాన్ని నేను గీతలో చెప్పాను, అది ప్రమాణంగా తీసుకొని జీవిస్తే బాగుపడతావు అని చెపుతూ నీకు ఎలా బాగుంటే అలా చెయ్యమని భగవంతుడు చెప్పాడు కాని బలవంతం చెయ్యలేదు. మీరు ఏదైనా మంచిస్థితిలో ఉన్నారు అనుకోండి, మీకు ఇష్టులైనవారిని కూడా ఆస్థితికి తీసుకొని రావటానికి ప్రయత్నం చేస్తారు. ఒక మామూలు మనిషికే అంత ప్రేమ ఉన్నప్పుడు ఇంక మనం భగవంతుడిని విశ్వసిస్తే ఆయనకు మన పట్ల ఎంత ప్రేమ ఉంటుందో మరి.

రామకృష్ణుడు శరీరం విడిచిపెట్టేముందు వివేకానందుడు అంటాడు నువ్వు అవతార పురుషుడవని చెప్పకొంటున్నాము, రామకృష్ణుడు సద్గురువు అని చెప్పకొంటున్నాము. ఇప్పుడు మీరు కేన్సర్‌తో బాధపడుతున్నారు కదా. ఇప్పుడు కూడా ఇంత శరీరబాధలో కూడా మీకు భగవదనుభవం ఉందా లేక కిందకు జారిపోతున్నారా అని అడిగితే నరేన్, ఇలా ఎంతకాలం

సందేహిస్తూ ఉంటావు. ఏ రోజుకారోజు సందేహమేనా? ఎవడైతే రాముడో, ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు, కాని అద్వైతపరంగా కాదు, అద్వైతపరంగా చూస్తే ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని రామకృష్ణుడు చెపుతూ నాకున్నదంతా నీకు ఇచ్చేసి నరేన్ నేను పేదవాడిని అయిపోయాను అని చెప్పారు. గురువు అంటే శరీరం కాదు, గురువు అంటే ఆత్మ. తరువాత కూడా వివేకానందుడు కొన్ని మహిమలకు ఆకర్షింపబడ్డాడు, గురువు అతనికి లోపల దర్శనమిచ్చి మాయలో పడకుండా ప్రోపర్‌గా గైడ్‌చేసుకొంటూ వెళ్ళాడు. ఒకసారి స్వామీజీ ఆయన అనుభవం చెప్పారు. ఆయనకు అమెరికాలో చాలా పేరు వచ్చింది. నీ గురువు ఏమిటి, ఆయనకు చదువు సంధ్యా లేదు ఆయన వలన నీకు గౌరవం రావటం ఏమిటి, నీవలననే ఆయనకు గౌరవం, వైభవం వస్తోంది అని కొంతమంది అంటే నిజమేనేమో అని కొంచెం స్వామీజీకి అనిపించిందట. గురువు అంటే అంతర్యామి, లోపలే ఉన్నాడు కదా, ఈ తలంపు చూసాడు, వీడికి విషం పట్టుకొంటోంది, దానిని తొలగించాలి, ఆ వ్యక్తిభావనను పోగొట్టాలి, ఆ చెడుతలంపును మొదటలోనే తుంచేయాలి అనుకొన్నాడు. మరుసటిరోజు ఒక అమ్మగారు స్వామీజీకి భోజనం చెప్పారు. ఆ రాత్రి రామకృష్ణుడు ఆమెకు స్వప్నంలో కనిపించాడు. ఆ అమ్మగారు ఆర్టిస్టు, రామకృష్ణుడు ఎలా ఉంటాడో అలాగ గోడమీద ఆయన బొమ్మ వేసేసింది. స్వామీజీ భోజనానికి వచ్చినప్పుడు ఆ బొమ్మను చూసి ఆశ్చర్యపోయాడు. ఆయన ఎవరు అని ఆ అమ్మగారిని అడిగాడు. ఆయన ఎవరో నాకు తెలియదు, రాత్రి స్వప్నంలోనికి వచ్చాడు, ఆ బొమ్మనాకు వేయాలనిపించింది, వేసాను అని చెప్పింది. అప్పుడు వివేకానందుడు అనుకొన్నాడు నాకంటే నా గురువు ముందు వచ్చేసాడు అని లెంపలు వేసుకొన్నాడు అంటే గురువు నన్ను నడుపుతున్నాడు, నాకేదయినా గౌరవం వస్తే దానికి కూడా గురువే కారణం అని అప్పుడు గుర్తించాను అని స్వామీజీ చెప్పారు. అంటే ఆయనకు ఈ పాడుబుద్ధి రాలేదు, వారు వీరు చెపుతూ ఉంటే ఆ పిచ్చి మాటలు పట్టుకొని సడన్‌గా ఆయనకు గర్వం వచ్చేసింది. దానిని తొలగించటానికి గురువు ఆవిధంగా చేసాడు. గురువుతో ఎప్పుడూ అద్వైతం పనికి రాదు. మనకు నిజంగా గురుభక్తి కుదిరింది అనుకోండి, అందరిలోనూ మనకు గురువే కనిపించాలి, అది గురుభక్తి అంటే. గురువు అంటే శరీరం కాదు. గురువుతో ఉన్న అనుబంధం ఆ శరీరం పోయిన తరువాత కూడా కంటిన్యూ అవుతుంది. గురువుతో మానసిక అనుబంధం చాలా ముఖ్యం. భగవాన్ నాలుగు రోజులకు శరీరం విడిచిపెడతారు అనగా ఎవరో అన్నారు ఈ శరీరం పోతోంది ఇంక మీకు మాకు సంబంధం తెగిపోతుంది కదా అంటే భగవాన్ ఏమి చెప్పారు అంటు పూర్వజన్మలలో ఏ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకొన్నామా, ఈ సంబంధం మనలను మరొకచోట కలపదా అన్నారు. అంటే మనకు ఆత్మజ్ఞానం

కలిగే వరకు గురువు మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. ఏసుక్రీస్తు శరీరాన్ని ఏవిధంగా అయితే శిలువ వేసారో అలాగ మీ అహంకారాన్ని శిలువ వేస్తే మీకు అమృతానుభవం కలుగుతుంది, ఇప్పుడే ఇక్కడే ఈ శరీరం ఉండగానే మోక్షసుఖాన్ని పొందుతారు. గాఢ నిద్రలో మనకు దేహాభిమానం లేదు, అలాగ దేహాభిమానం లేకుండా జాగ్రదవస్థలో ఉండగలిగితే వ్యక్తిభావన నశిస్తుంది. అలాగ ఉండాలని అనుకోవటం కాదు, అలాగ మీరు ఉండగలగాలి. చనిపోయిన తరువాత చాలా లోకాలు ఉన్నాయి అని చెపుతున్నారు అది నిజమా అని భగవాన్‌ను అడిగితే చూచినవారు చెపుతున్నారు కాబట్టి మనం నమ్మాలి అయితే ఈ మనస్సు ఎంత నిజమో ఆ లోకాలు కూడా అంతే నిజం. మనస్సు నశిస్తే ఏమీ లేదు అని భగవాన్ చెప్పారు. భవిష్యత్‌లో గాలిమేడలు కట్టవద్దు . జరిగిపోయిన విషయాలు అస్తమానుతలపెట్టుకోవద్దు. వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొంటూ ఈ మనస్సును ధ్వంసం చేయటానికి ప్రయత్నం చేసుకో, అదే సాధన. శరీరం చనిపోవటానికి సాధన ఎవరూ చేయనక్కరలేదు. ఏదో రోజున శరీరం చనిపోతుంది. దేహంతో తాదాత్మ్యం పొందే తలంపును ధ్వంసం చేయటం మీదే నీ సాధనను గురిపెట్టు.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి, ఏది సత్యమో, ఏది నిత్యమో, ఏది సర్వకాల సర్వావస్థలలో ఎప్పడూ మనకూడా ఉంటుందో అటువంటి ఆనందాన్ని పొందటం కోసం ప్రయత్నం చేయటం మానివేసి అది సాధించాలి, ఇది సాధించాలి అని కాలక్షేపం చేస్తున్నారు. ఓ పిచ్చివాడా! నువ్వు వచ్చినపని మర్చిపోవద్దు. నీ దేహప్రారబ్దంలో ఏది ఉంటే అది జరుగుతుంది, ఆ పని చేసే యోగం నీకు లేకపోతే నీ ద్వారా ఆపని జరుగదు. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. స్మశానానికి వెళ్ళేవరకు విధి నీ దేహాన్ని నడిపించుకుంటూ వెళ్ళిపోతుంది. ఈ లోపుగా కలగాపులగం చేసుకొని, లోకంతో తాదాత్మ్యం పొంది నీ మనస్సును పుండు చేసుకొని, నువ్వు చెడిపోవద్దు. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టి నువ్వు ఆత్మజ్ఞాన సముపార్జనకు ప్రయత్నం చెయ్యి. ముందు విషయం సరిగా అర్థం చేసుకో. నీ ఆలోచనలో స్పష్టత వచ్చేటప్పటికి, నీ బ్రెయిన్‌లో స్పష్టత వచ్చేటప్పటికి, నీకు సబ్జక్టు కొంత అర్థమవుతూ ఉంటేనే లోపల నుండి కొంత ఆనందం నీకు అందుతూ ఉంటుంది, వస్తువు అనుభవంలోనికి వస్తే వేరే చెప్పనక్కర లేదు. నీకు భక్తి వస్తే ముక్తి వచ్చేసినట్లే అన్నారు భగవాన్. జేబులో డబ్బు ఉండాలి కాని రైలు టికెట్ ఎంత సేపు కొనుక్కొంటాము, రైలులో కూర్చొన్నాక ఒక గంట ముందో, వెనుకో గమ్యానికి తీసుకొనిపోతుంది. ఆచార్యులువారు శివుడితో నువ్వు మెడలో పాములు వేసుకొన్నావు ఇంక నిన్ను ఆభరణాలు ఏమి అడుగుతాను, చర్మం కట్టుకొని తిరుగుతున్నావు ఇంక బాహ్యంగా

నిన్ను ఏమి అడుగుతాను, నీ పాదాలయందు భక్తిని ప్రసాదించు అన్నారు. భక్తి కలిగితే ముక్తి వచ్చేసినట్లే. భక్తి సంపాదించటం కష్టం. నిష్కామకర్మ కంటే ధ్యానం గొప్పది అని కొంతమంది చెపుతారు ఎందుచేతనంటే నిష్కామకర్మ చేస్తే ఎప్పడో ఆ ఫలితం వస్తుంది. కాని నీవు ప్రోపర్‌గా ధ్యానం చేస్తూ ఉంటే, ధ్యానస్థితి నీకు కుదిరితే అప్పటికప్పడు నీ మనస్సు చల్లబడుతుంది. మానసికఅనుబంధం పెట్టుకొంటే మనస్సులో ఉన్న దోషాలు నశిస్తాయి. మనం పైకి ఆడంబరంగా ఉండాలి అనుకొంటాము అనుకోండి అంటే లోపల శాంతి లేదు అని అర్థం. అందరిచేత గౌరవింపబడాలి అని అనుకొంటాము అనుకోండి లోపల శాంతి లేదు అని అర్థం. మన లోపల ఉన్న అశాంతే బయట గౌరవాల కోసం ఇలా ఏడుస్తూ ఉంటుంది. మనస్సు నిజంగా అణిగిపోతే పరిసరాలతో ఎంతో సన్నిహితమైన సంబంధం వస్తుంది, ఈ సృష్టిని కౌగిలించుకోవాలి అనిపిస్తుంది, మనస్సు నశించినప్పడు ఈ సృష్టి మీద నీకు ప్రేమ కలుగుతుంది. లోపల ఉన్న శాంతి అనుభవంలోనికి వచ్చినప్పడు వాడు ఇతరులను ఉద్ధరించాలని అనుకోడు, వాడు శరీరం ధరించి ఉంటే చాలు ఆ శరీరం ద్వారా లోకోద్ధరణ జరుగుతూ ఉంటుంది. భగవాన్ ఒక మాట చెప్పారు నాలో కనుక అజ్ఞానం ఉంటే మీకు చెప్పటానికి నా దగ్గర ఏమీ లేదు, నేనే కనుక జ్ఞానిని అయితే నాకు చెప్పటానికి ఇతరులు లేరు. మనం కుడిచేతిలో ఉన్న వస్తువును ఎడమచేతిలో పెట్టుకొని ఎవరినో ఉద్ధరించాము అని అనుకోము ఎందుచేతనంటే రెండు చేతులు మనవే. జ్ఞాని యొక్క వైభవం కూడా అటువంటిదే, అంతా తానే.

ఇతరులకు నువ్వు చేసే సహాయ సహకారములు అంతా తిరిగి నీకే వచ్చేస్తుంది అని భగవాన్ చెప్పారు. నువ్వు ఏమనుకొంటు న్నావు వారికి ఉపకారం చేస్తున్నాను అనుకొంటున్నావు, వారికి ఉపకారం చేయటం లేదు, నీకు నువ్వే ఉపకారం చేసుకొంటున్నావు, ఆ విషయం నీకు తెలియక వారికి ఉపకారం చేస్తున్నాను అనుకొంటున్నావు. దేహం ఏదో రోజు చనిపోతుంది. జీవితానికి, చావుకీ బేధం లేనిస్థితి ఒకటి ఉంది, ఈ దేహానికి మరణం వచ్చే లోపు ఆస్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి, అదే సాధన యొక్క గమ్యం అని గాంధీ చెప్పారు. ఇంక మనం చేసేపని అంటావా మన దేహం ద్వారా ఏ పని జరగవలసి ఉంటే అది జరుగుతుంది. ఎవరో ఇతరుల గొడవ ఎందుకు, మేము ఇప్పడు ప్రసంగాలు చెపుతున్నాము, ఇవి ఇష్టంతో చెప్పటం లేదు, మౌనంగా ఉండటం ఉత్తమం అనిపిస్తుంది, కాని చెపుతున్నాము. ఒకవేళ ఇవన్నీ మానేసి ఇంటి దగ్గర కూర్చొంటాము అనుకోండి ఇంటికి వచ్చేస్తున్నారు కదా, అప్పడు ఇంటి దగ్గర చెప్పవలసి వస్తోంది. నేను ఇష్టంతో చెపుతున్నాను అని చెప్పలేను కాని అది ఆ దేహప్రారబ్ధం, ఆ దేహం అందుకు నియమింపబడింది,

చెప్పకొంటూ వెళ్ళవలసిందే. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా మన దేహప్రారబ్ధంలో ఏది ఉంటే అది జరిగిపోతూ ఉంటుంది. నువ్వు చేసేది ప్రేమగా చెయ్యి, ఇష్టంగా చెయ్యి. నీకు పాతవాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు, అజ్ఞానం నశిస్తుంది, నీకు జ్ఞానోదయం కలగటానికి ఆ పని నీకు సహకరిస్తుంది.

నువ్వు జపం చేసి, ధ్యానం చేసి ఎంత కష్టపడినా కాని నీ మనస్సు అదుపులోనికి రాకపోతే మహాత్ముల సమక్షంలో నీ మనస్సు నిశ్చలమవుతుంది, నిర్మలమవుతుంది, నీ మనస్సు అణుగుతుంది, నీకు సమాధిస్థితి కలుగుతుంది. భగవంతుడిని విశ్వసించి, ఆయనను నిరంతరం స్మరించటం వలన మనకు అన్నీ ఇచ్చి మోక్షం కూడా ఇస్తాడు. విశ్వాసహీనుడికి ఇహం లేదు, పరం లేదు. బలహీనతలలో నుండి విడుదలపొందటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే గురువు నీకు సహాయం చేసి నీకు నొప్పి తెలియకుండా వాటిలో నుండి నిన్ను విడదల చేస్తాడు. నువ్వు పొందవలసింది పొందిన తరువాత దానికి మించినది కాని, దానితో సమానమైనది కాని ఏదీ లేదు అని నీకు అనుభవంలోనికి వస్తుంది. భగవాన్ చెపుతూ ఉండేవారు అనేక మంది వచ్చి మంత్రాల గురించి, పూజల గురించి, మహిమల గురించి, సాధనల గురించి ఇంకా ఎన్నో చెపుతున్నారు, దేని మీద నాకు ఆకర్షణ కలుగలేదు అని చెప్పారు. పొందవలసింది ఏదో అప్పటికే పొంది ఉన్నాడు ఇంక ఆకర్షణ ఏమి ఉంటుంది. మీకు ఏదైనా తెలియని విషయంలో ఎవరైనా మిమ్మల్ని మోసం చేయగలరు కానీ మీకు తెలిసిన విషయంలో మిమ్మల్ని ఎవరూ మోసం చేయలేరు. మాకు అన్నీ ఉన్నాయి కానీ సుఖం లేదు అని కొంతమంది అంటారు. అన్నీ ఉంటే సుఖం ఎక్కడ నుండి వస్తుంది? సుఖం ఎక్కడ ఉందో ఆ వస్తువు మీకు తెలియాలి కదా. మీకు డబ్బు ఉంది అనుకోండి, శరీరానికి కంఫర్టు తీసుకొని వస్తుంది కానీ మనస్సుకు నిగ్రహం తీసుకొని రాలేదు. నీకు ఉన్న సంతానం వలన కాని, ధనం వలన కాని, చదువు వలన కాని, అధికారం వలన కాని నీకు మోక్షం రాదు అని వేదంలో చెప్పారు. మీ తల్లిదండ్రులు మంచివారు అనుకోండి పది రూపాయలు ఇస్తారు, బట్టలు ఇస్తారు అంతేగాని జ్ఞానాన్ని ఇవ్వలేరు, వారి దగ్గర ఉంటే కదా ఇవ్వటానికి. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో, ఎప్పుడూ ఏ వస్తువు అయితే ఉందో దానిని పొందటం లాభమా, ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువులను పొందటం లాభమా అది మీరు ఆలోచించుకోండి, మిమ్మల్ని బలవంతం చేయటం లేదు. గాఢనిద్రలో మీకు దేహాభిమానం లేదు, అప్పుడు మిమ్మల్ని ఎవరైనా పొగిడినా సంతోషించరు, విమర్శించినా దుఃఖపడరు. జాగ్రదవస్థలో అలా ఉండటం నేర్చుకోండి, ఈ మాటే మీకు గురువు, దీనిని అభ్యాసం చేయండి. భగవంతుడు మనకు ఇచ్చిన అమూల్యమైన జీవితాన్ని జ్ఞానం

పొందటానికి ఉపయోగించకుండా చిల్లర విషయాలకు ఖర్చుపెడుతున్నాము. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను చూసి అవినయం తెచ్చుకోవద్దు. భగవంతుడు ఇచ్చిన అవకాశములను చూసి అవినయం తెచ్చుకోవద్దు. భగవంతుడు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకొంటూ, ఆత్మజ్ఞాన సముపార్జనకు వాటిని ఉపయోగించుకోవాలి. కొంతమంది చిన్న పనిచేస్తారు, వారికి గొప్ప లాభం వస్తుంది. ఏమిటి ఈ మాత్రం దానికే అంత లాభం వచ్చింది? వారు ధనవంతులు అయిపోయారు అనుకొంటాము, అలా కంగారు పడకండి. పూర్వజన్మలకు దీనికి సంబంధం ఉంటుంది. మీకు సడన్‌గా ఏదయినా లాభం వచ్చినా, సడన్‌గా నష్టం వచ్చినా దీనికి పూర్వజన్మలకు ఏదో సంబంధం ఉంటుంది అని శాస్త్రంలో చెప్పారు. అది అర్థంకాక కంగారుపడతాము. మన ఇంట్లో నలుగురు ఉన్నారు అనుకోండి, అందరూ ఒకే రోజున చనిపోరు, మనం ఉండగా వారు అయినా పోతారు లేకపోతే వారు ఉండగా మనమైనా చనిపోతాము. అంటే ఆ కుటుంబంతో ఎంతవరకు అనుబంధం ఉంటే అంతవరకే. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే చనిపోయిన వారి గురించి దుఃఖపడకండి, బతికి ఉన్నవారు ఎప్పుడు పోతారు అని కనిపెట్టుకొని ఉండవద్దు అని చెప్పాడు. ఈ రెండూ నేర్చుకోండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-02-05, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మురమళ్ల గ్రామంలో ఉన్న భద్రకాళీసమేతవీరేశ్వరస్వామి వారి ఆలయం చాలా పురాతనమైనది. పూర్వం ఇక్కడ ఎందరో మునులు జపతపాదులు చేసినారు. మనం ఎంత సాధన చేసినా ఈశ్వరుని దయ ఉండాలి, ఆత్మజ్ఞాన సముపార్జనకు ఈశ్వరుని దయ అవసరం, ఆయన దయకు పాత్రులం అవ్వకుండా మన వలన ఏమీ సాధ్యం కాదు. ఎవడి కయితే రాగ ద్వేషములు లేవో, ఎవడయితే స్తోత్రాలకు పొంగకుండా విమర్శలకు కుంగకుండా ఉంటున్నాడో, ఎవడయితే భావోద్రేకం లేకుండా అన్నింటిని సహిస్తున్నాడో వాడిని బంగారం లాంటి మనస్సు కలవాడు అంటారు. ఆ బంగారంటాంటి మనస్సును సాధించాలంటే ఈశ్వరుని పాదాలను ఆశ్రయించాలి. మనం పూర్వజన్మలలో చేతితోగాని, మాటలతోగాని, ఆలోచనతో గాని ఏవైనా పొరపాట్లు చేసిఉంటే ఈజన్మలో రెండు రకాలుగా పీడించబడతాము. ఒకటి శరీరానికి రోగం వస్తుంది, రెండవది మనస్సుకు శోఖం వస్తుంది. ఈ రెండింటిలో నుండి విడుదల పొందాలంటే ఈశ్వరునిదయ ఉండాలి, గురువు అనుగ్రహం ఉండాలి. మనం రోజూ కొద్దిసేపు ఏకాంతంగా ఉండి భగవంతుడిని స్మరించుకోవాలి, జరిగిపోయిన గొడవలు

విడిచిపెట్టాలి, భవిష్యత్ గురించి ఊహించుకోకూడదు. ఇప్పుడు మీరు అనుభవించే ప్రారబ్ధం అది అదృష్టంకాని, దురదృష్టంకాని దేనినైనా తీయగా అనుభవిస్తే అది ఖర్చు అయిపోతుంది. ఈ విధంగా జీవించటం వలన జ్ఞానం కలుగుతుంది. మనం చేసే పని ధర్మంగా చేయాలి, ధర్మంగా చేయలేకపోతే ఊరక ఉండటం మంచిది. సాధ్యమయినంత వరకు ఇతరుల గొడవలలోనికి వెళ్ళకూడదు. రోజూ ఇతరుల గొడవలలోనికి వెళ్ళటం వలన అజ్ఞానం పెరుగు తుంది.

మన పని మనం చేసుకొంటూ ఇతరులకు సహకరించాలి. భగవంతుడు మనకు కేటాయించిన పనిని ధర్మంగా చేస్తూ ఉంటే, హృదయపూర్వకంగా చేస్తూ ఉంటే మనకు శాంతి కలుగుతుంది, మోక్షం కలుగుతుంది. మనం ప్రేమించదగినవాడు ఒక్క భగవంతుడు మాత్రమే. భగవంతుడిని ఎలా చెప్తారు అంటే అస్తి, భాతి, ప్రియం, నామం, రూపం. అస్తి అంటే ఎప్పుడూఉండేది, భాతి అంటే ప్రకాశిస్తూ ఉంటాడు, ఆయన ఉండటం వలననే ప్రకాశిస్తూ ఉంటాడు, ఇతరుల సహాయం అక్కరలేదు. ప్రియం అంటే అంతకంటే ప్రియమైనది, ప్రేమించ దగినది ఏదీ లేదు. ప్రతీ మనిషికి వాడంటే వాడికి ఇష్టం. ఎందుచేతనంటే భగవంతుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడి మాయచేత ఈ రూపం, నామం కల్పించ బడ్డాయి అయితే మనం నామ రూపములను చూసేటప్పుడు వాటికి ఆధారంగా ఉన్న భగవంతుడిని చూడాలి. ఉన్న వస్తువు ఎప్పుడూ ఉంది, మిగతావి అన్నీ మనోకల్పితములు. మనం ఎవరిపట్ల అయినా దయతో వారి ఆర్థికబాధలు తొలగించవచ్చు, భగవంతుడికి మన మీద దయ కలిగింది అనుకోండి మనకు ఆర్థికబాధ పోతుంది, అజ్ఞానం కూడా పోయి మోక్షం వస్తుంది. భగవంతుడు చెప్పిన మాటను మనం నోటిలో వేసుకొని, మనస్సులో దానిని మననం చేసుకొంటూ ఉంటే ఏదో ఒక రోజున ఆయన దయ కలుగుతుంది. సత్పురుషులు అంటే మనం ఎవరి దగ్గరకు వెళితే మనకు భగవంతుడి గురించి తప్పించి ఇతర విషయాలు చెప్పరో వారు సత్పురుషులు. పరమేశ్వరుడు మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మన చేతిలో ఉన్న అన్నం ముద్దను వదిలేసి చేయి నాకటం ఎటువంటిదో, మన హృదయంలో ఉన్న పరమేశ్వరుడిని వదిలేసి ఆయన కోసం గుడులు, గోపురాల చుట్టూ తిరగటం కూడా అటువంటిదే. మనం చేసే పని ఫలితాన్ని ఆశించకుండా చేయాలి. మనం కోరికను బట్టి పని చేస్తాము, దానిని బట్టి సంసారం ప్రారంభమవుతుంది. కోరిక లేకుండా పనిచేస్తే మనకు మోక్షం వస్తుంది. స్వార్థపరుడు తన స్వార్థం కోసం ఎలా పనిచేస్తాడో అలాగే మీరు సమాజం కోసం, ఇతరుల కోసం పనిచేసినా మీకు మోక్షం వస్తుంది. మనం తిండి దగ్గర, మాట దగ్గర బహుజాగ్రత్తగా ఉండాలి. మీ శరీరానికి పడని పదార్థాలు

తినకూడదు. అప్పుడు మీ శరీరం తేలిగ్గా ఉంటుంది, సాధన చేసుకోవటానికి బాగుంటుంది. మన శరీరం కూడా మనకు గురువే. మనం తినేటప్పుడు ఇది సరిపోతుంది అని చెపుతుంది అప్పుడు ఆపు చేయాలి, ఎక్కువగా తినకూడదు. మనం చేసే పని ఈశ్వరార్పణతో చేయాలి. ఒకోసారి మనకు కలిసివస్తుంది, ఒకోసారి మనకు కలిసిరాదు, అయినా మన మనస్సు సమానంగా ఉండేటట్లు చూసుకోవాలి. అలాగ ఉంటే భగవంతుడికి మీపట్ల దయ కలుగుతుంది. మీకు జ్ఞానాన్ని ఇస్తాడు, మోక్షాన్ని ఇస్తాడు.

మనం గురువును గౌరవించాలి, గురువు పాదాలను విడిచిపెట్టకూడదు. బ్రహ్మానుభవం పొందటానికి నాలో ఏవైతే అడ్డుగా ఉన్నాయో ఆ కుట్ర అంతా నువ్వు కోసుకొంటూ వస్తున్నావు. నాలో ఉన్న చెడు గుణాలను తీసేసి నాకు మంచి గుణాలను ఇచ్చావు. నాలో ఉన్న చిరాకు, విసుగు, కోపం, అసూయ అంతా తీసేసి, నాలో ఉన్న కుట్రను అంతా తొలగించి నాకు మార్గం నిర్దేశించి ఇలా నడుచుకో అని చెప్పటం వలన, అహంకారం అనే దుప్పటిని తొలగించి నీదయ అనే దుప్పటిని కప్పటం వలన నా హృదయం అంతా శాంతిలో నిండి పోయింది, ఓ అరుణాచలేశ్వరుడా! నీవు వేరు, నేను వేరు అనే వేరుభావన పోయింది. నీ దయ వలన దేహభావన పోయి బ్రహ్మభావన కలిగింది, ఇప్పుడు బ్రహ్మానుభవంలో, ఆ ఆనందంలో ఊగిసలాడుతున్నాను, ఇంక నాకు ఏమి కావాలి అంటున్నారు భగవాన్. మనం గురువు చెప్పిన వాక్యాన్ని, శాస్త్రం చెప్పిన వాక్యాన్ని శ్రవణం చేయాలి, మననం చేయాలి. మీకు అందరికి జ్ఞానం కలుగుతుంది, హద్దులు లేని, పరిమితులు లేని శాంతిని మీరు అనుభవిస్తారు. సాధన అంటే అక్కడ దేవుడి పఠం పెట్టుకొని నాలుగు పూలు పెట్టటం సాధన అనుకొంటున్నారు. పూజ, జపం, ధ్యానం చేయండి మంచిదే. ఇంట్లో ఎవరైనా మీకు చిరాకు కలిగించే మనుషులు ఉన్నా మీ పని ఏదో మీరు చేసుకొంటూ వెళ్ళిపోవాలి, వారు ఉద్రేకపడినా మీరు ఉద్రేకపడకుండా శాంతిగా మీ పని ఏదో మీరు చేసుకొంటూ వెళ్ళిపోతూ ఉంటే అప్పుడు భగవంతుడు మీకు జ్ఞానాన్ని ఇస్తాడు. భావోద్రేకం పనికిరాదు. మన హృదయంలో శాంతి ఉంది, భగవంతుడు ఉన్నాడు. ఆయన దయ లేకుండా ఆయన మనకు తెలియబడడు. మనం చెప్పేమాట, చేసేపని నిదానంగా ఉండాలి, ఏకంగా ఉండాలి. అప్పుడు ఆయన దయకు పాత్రులవుతాము. అరుణాచలా అని నిన్ను స్మరించగానే నా అహంకారాన్ని తీసేసావు, నీ స్వరూపాన్ని నాకు ఇచ్చావు ఇట్టిదా నీ అనుగ్రహం. ఆయన దయ మనకు కొంచెం కలిగితే మనకు జ్ఞానం వచ్చేస్తుంది. మనకు ఏదైతే అసాధ్యం అనుకొంటున్నామో అది ఈశ్వరుడికి సాధ్యమే. నాలో ఉన్న దేహభావనను పోగొట్టి నాకు బ్రహ్మభావన ఇచ్చేటప్పుడు నా మొఖం నలగకుండానే దానిని నాకు ప్రసాదించావు అన్నారు

భగవాన్.  ఏనుగు నిద్రపోయేటప్పుడు స్వప్నంలో సింహం వస్తే భయం వలన ఏనుగుకు వెంటనే మెలకువ వచ్చేస్తుంది.  అలాగే అజ్ఞానమనే నిద్రలో ఉన్న జీవుడికి గురువు కృప అనే సింహం ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి వచ్చేస్తాడు.  గురువు యొక్క శక్తి అటువంటిది.  మీరు ఎవరికయినా అన్నం పెట్టారు అనుకోండి, ఆ అన్నం వాడి అహంకారం తింటుందా?  వాడిలోపల జఠరాగ్ని ఉంటేనే తినగలడు.  ఆ రూపంలో ఉన్న వాడు ఈశ్వరుడు.  మీరు పెట్టిన అన్నం తినేవాడు ఈశ్వరుడు.  అక్కడ రూప, నామములు ప్రధానం కాదు, ఆ రూప నామములు మాయ.  గురువు దయ వలననే నీవు అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి వస్తావు.

మనం దేహం నేను అనుకొంటున్నాము కాబట్టి దేహము చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని అనిపిస్తుంది.  ఆ దేహభావనను తగ్గించుకొంటూ రావాలి.  నీకు శాంతి కావాలి, పరమాత్మభావనలో శాంతిని పొందు.  లోకవిషయాలలో నీవు శాంతిని పొందటానికి ప్రయత్నం చేసినా భవిష్యత్‌లో అది దుఃఖం కింద మారిపోతుంది.  ఇప్పుడు మీరు, మీ అత్తగారు బాగా ఇష్టంగా ఉన్నారు అనుకోండి, శాంతిని పొందుతున్నారు అనుకోండి, మరల ఎప్పుడైనా మీకు, మీ అత్తగారికి పేచీలు వచ్చినప్పుడు ఈ శాంతి అంతా అశాంతిగా మారిపోతుంది, మీ సంతోషం అంతా దుఃఖంగా మారిపోతుంది.  సంసారంలో మీరు ఏ సుఖాలను అనుభవించినా ఈ సుఖాలన్నీ నూటికి నూరుపాళ్ళు వడ్డీతో సహా దుఃఖంగా మారిపోతాయి.  మనిషి శాంతి లేకుండా బతకలేడు, శాంతి లేనివాడికి సుఖం లేదు.  నీకు ఇంట్లో ఎంత డబ్బు ఉన్నా, ఆ డబ్బును బట్టి సుఖం రాదు, శాంతిని బట్టి సుఖం వస్తుంది. మన దేహప్రారబ్ధంలో వచ్చేది వస్తుంది, రానిది రాదు.  మీ దేహప్రారబ్ధంలో ఏదైనా వచ్చే యోగం ఉంటే దానిని ఎవరైనా పట్టుకొని ఆపాలన్నా అది ఆగదు, దేహప్రారబ్ధంలో లేనిది మీరు తీసుకురావాలన్నా అది రాదు, ఇది ఈశ్వరాజ్ఞ.  చెరువులో చాలా నీళ్ళు ఉంటాయి. మనం చెంబు తీసుకొని వెళితే చెంబుడు నీళ్ళు వస్తాయి, బిందె తీసుకొని వెళితే బిందెడు నీళ్ళు వస్తాయి.  అలాగే మనం జన్మాంతరంలో చేసిన దానిని బట్టి ఏ జీవుడికి ఎంత రావాలో అంతా వస్తుంది, మనం ఆశిస్తే ఎక్కువ రాదు, మరిచిపోతే తక్కువరాదు.

భగవంతుడు చెప్పిన వాక్యాలను వినండి, వింటే సరిపోదు, మననం చేసుకోండి, వాటిని మీ సొంతం చేసుకోండి, ఆచరించగలిగినవి ఆచరించండి, ఆచరించలేకపోతే ఎందుకు ఆచరించలేకపోతున్నాము అని విచారణ చేసుకోండి.  ఇలా చేయగా చేయగా ఈశ్వరుని దయ మీకు కలుగుతుంది.  శ్రవణం, మననం, జప ధ్యానములు, వివేకం, విచారణ

విడిచి పెట్టవద్దు. భగవంతుని స్మరణ విడిచిపెట్టవద్దు. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా ఒక్క అగ్గిపుల్లకు లోకువ అలాగే నీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా అవి భగవంతుని నామానికి లోకువ. నీటిలో ఉప్పవేస్తే ఆ ఉప్ప నీటిలో ఎలా కరిగిపోతుందో అలాగ నీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూఉంటే ఆ నామంలో ఈ దోషాలు అన్ని కరిగి పోతాయి. భగవంతుడి యొక్క స్మరణ కరిగించలేని దోషం అంటూ ఈ సృష్టిలో ఏదీ లేదు, అటువంటిది భగవంతుడి యొక్క నామం. కొంతమంది మనుషులకు ఎటు చూసినా కష్టాలే, వారికి ఎటుచూసినా ముళ్ళే కనిపిస్తాయి కాని వారు శాంతిగా ఉంటారు. అటువంటి వారిని చూసి వీరు అశాంతికి కారణాలు ఉన్నా శాంతిగా ఉంటున్నారు, సహనంగా వాటిని భరిస్తున్నారు అని భగవంతుడు మెచ్చుకొని వారికి మోక్షాన్ని ప్రసాదిస్తాడు. మీకు ఆత్మజ్ఞానం కలగాలంటే పరమేశ్వరుని పట్ల భక్తి కలిగి ఉండండి. నోట్లో పాయసం పోసుకొన్నప్పడు మీకు ఎలాగ ఉంటుందో అలాగే భగవంతుడి యొక్క గుణాలను ఆస్వాదించండి. భగవంతుడి గురించి వినండి, ఆయనను స్మరించండి, ఆయనను పూజించండి, పవిత్రులు కండి. ఆంజనేయస్వామి రావణాసురిడితో అంటాడు నువ్వు పూర్వం కొన్ని మంచిపనులు చేసావు. ఇప్పడు లంకకు రాజు అయ్యావు. ఇప్పడు చెడ్డ పనులు మొదలుపెట్టావు, ఈ చెడ్డపని నిన్ను పీడించేస్తుంది, దేనికదే అనుభవించాలి అని చెప్పాడు. నీ దేహానికి ఏదైనా ప్రారబ్ధం ఉంది అనుకో, అది మంచి ప్రారబ్ధం అయినా స్వప్నమే, చెడు ప్రారబ్ధమయినా స్వప్నమే. మంచి ప్రారబ్ధం వస్తే పొంగిపోవద్దు, చెడు ప్రారబ్ధం వస్తే కృంగిపోవద్దు. అప్పడు నీవు ఈశ్వరుని దయకు పాత్రుడవు అవుతావు అని ఆచార్యులవారు చెప్పారు.

ఏమి లేనప్పడు మనం అణిగే ఉంటాము, అన్నీ వచ్చినప్పడు అణిగి ఉండాలి. మీ ఇంట్లో పది రూపాయలు ఉంటే అదే సంపద అనుకొంటున్నారు, మీ ఇంట్లో ఉన్న డబ్బు మీకు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి పెట్టదు. మీలో ఉన్న వినయం, వివేకం, మంచితనం, ఏకాగ్రత ఇవే నిజమైనసంపద. ఈ సంపద మటుకే మీకు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి పెడుతుంది. మీకు నిజంగా జ్ఞానం కావాలంటే భగవంతుని పాదాలను విడిచిపెట్టవద్దు, భగవంతుని స్మరణ విడిచిపెట్టవద్దు. సూర్యుడు గొప్పవాడే, ప్రపంచానికి అంతా వెలుతురు ఇస్తున్నాడు, అటువంటివాడికే గ్రహణం పడుతుంది. అలాగే మీరు ఎంత పెద్దవారు అనుకొన్నా సరే చావు మిమ్మల్ని విడిచిపెట్టదు, దేహప్రారబ్ధం అనుభవించటం తప్పదు. అహంకారం లేకపోతే కలహం రాదు. మీ అత్తగారు మిమ్మల్ని ఏమైనా అంది అనుకోండి, మాటకు మాట అనేస్తూ ఉంటే కలహం పెరిగిపోతుంది, మాటల వల్ల జగడాలు పెరుగుతాయి, మౌనం

బంగారం. ఎక్కడయితే మాట, మనస్సు, ఇంద్రియాలు అణిగిపోయినాయో అక్కడ మౌనం వస్తుంది, ఆ మౌనంలో మన హృదయంలో ఉన్న గోవిందుడు మనకు గోచరిస్తాడు. నువ్వు భక్తిని విడిచిపెట్టవద్దు. భగవంతుడి గురించి మాట్లాడేవారి దగ్గరకు వెళ్ళు కాని అన్యంగా మాట్లాడేవారి దగ్గరకు నువ్వు వెళ్ళవద్దు. అటువంటి మంచి స్నేహితులు దొరికితే వెళ్ళు లేకపోతే ఒంటరిగా బతుకు. కాఫీ దొరకలేదని ఎండ్రిన్ తాగవద్దు అలాగే మంచివారు దొరకలేదని పాములతో స్నేహం చేయకు. నీకు ఎవరైతే జ్ఞానానికి మార్గం చూపిస్తున్నారో వారే సత్పురుషులు, అటువంటివారితో సహవాసం చెయ్యి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీరు భగవంతుడి పట్ల విశ్వాసం కలిగి ఉంటే, ఆయన పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే అప్పుడు మీ భక్తి పక్వానికి వస్తుంది, అప్పుడు మీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు మీకు స్వరూపంగా దర్శనమిస్తాడు. మీ భక్తి నిజమైతే, మీ భక్తిలో కపటం లేకపోతే మీ హృదయంలో ఉన్న భగవంతుడే మీకోసం శరీరం ధరించివస్తాడు, అది కర్మ వలన వచ్చిన దేహం కాదు, మనలను అనుగ్రహించటానికి వచ్చిన దేహం. ఈశ్వరుడే గురు రూపంలో మనకు బోధించటానికి వస్తాడు. బోధించటం కంటే గొప్పసేవ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. మీరు వందకోట్లు పెట్టి గుడి కట్టించారు అనుకోండి, అది మంచి పనే కాని పరమాత్మ గురించి బోధించటం కంటే మంచి పని, మంచి సేవ ఏదీ ఈ ప్రపంచంలో లేదు. పరమాత్మ గీతలో ఏమని చెప్పాడు అంటే ఓ అర్జునా! నీకు నాకు మధ్యన జరిగిన ఈ సంభాషణను ఎవడైతే అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవించి దానిని ఇతరులకు అర్థమయ్యేలాగ చెపుతున్నాడో వాడు నాకు అత్యంత ప్రీతిపాత్రుడు, వాడికంటే ప్రీతిపాత్రుడు నాకు ఈ సృష్టిలో ఎవడూలేడు అని పరమాత్మ చెప్పాడు.

మనం కోరికలతో పనిచేస్తాము, ఆ కోరికల వలన సంసారం వస్తుంది. మనిషి కూడా నీడ ఏవిధంగా అయితే వెంటాడుతుందో అదే విధంగా కోరికలు నెరవేర్చుకోవటానికి పనిచేసే వారికి ప్రతీజన్మలోనూ సంసారం వెంటాడుతుంది. మేము ఏదో సాధనలు చేసుకొంటున్నాము, మీ దయ మాకు కావాలి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అడిగితే ఇచ్చినట్లు, అడగకపోతే ఇవ్వనట్లునా. ఏ జ్ఞాని దయలేకుండా ఉండడు. టైము అయ్యేటప్పటికి మీరు మీ బిడ్డను అన్నానికి పిలుస్తారు కదా అలాగే భగవంతుడు మనకు తల్లి లాంటివాడు, ఆయన స్వరూపమే దయ, దయను ఇవ్వకుండా ఎలా ఉంటాడు. మీరు భగవంతుడి నామాన్ని స్మరిస్తున్నారు అనుకోండి. అది మీరు సరదాగా చేస్తున్నా, తెలియకచేస్తున్నా, కాలక్షేపానికి చేస్తున్నా కూడా మీ అజ్ఞానానికి నిప్పు అంటుకొంటుంది, మీ అహంకారానికి కోత పడుతుంది. నిప్పు మీద మీరు తెలియక

చెయ్యి వేసినా అది కాలుతుంది అలాగే భగవంతుడి నామాన్ని మీరు తెలియక అనుకొన్నా అది మీ అజ్ఞానాన్ని కాల్చేస్తుంది, అట్టిది ఆయన నామం. గురువు ఎప్పడూ శాంతిలో ఉంటాడు. ఆయన అశాంతిలో ఉంటే మనకు శాంతిని ఎలా ఇవ్వగలడు. అశాంతి పాప ఫలం, రోగం కూడా పాపఫలం. కొంతమందికి అన్నీ ఉంటాయి, ఎప్పడూ ఏదో బెంగతో ఉంటారు. వారు పూర్వజన్మలలో చేసిన పాపం బెంగ రూపంలో వస్తుంది. డబ్బు పెట్టి బజారులో ఉన్న వస్తువులను కొనుక్కోగలరు, భోగాన్ని కొనుక్కోగలరు కాని డబ్బు పెట్టి జ్ఞానాన్ని, శాంతిని కొనుక్కోలేరు.

ఆత్మజ్ఞాన సముపార్జనకు గురువు అవసరం కదా, నన్ను గురువుగా ఎవరిని ఎన్నుకోమంటారు అని భగవాన్‌ను అడుగుతున్నారు. నన్నే గురువుగా ఎన్నుకోండి అని భగవాన్ చెప్పటం లేదు, ప్రపంచంలో ఎందరో మహానుభావులు ఉన్నారు. ఎవరిని స్మరిస్తూ ఉంటే నీ మనస్సుకు ఏకాగ్రత కలుగుతోందో, చల్లదనం వస్తోందో, ఎవరిని స్మరిస్తూ ఉంటే నీ మనస్సుకు లోచూపు కలుగుతోందో, నీ మనస్సుకు పవిత్రత కలుగుతోందో వాడినే గురువుగా తీసుకో అంటున్నారు. పెళ్ళికొడుకుకు, పెళ్ళికూతురుకు మధ్య తెర ఉంటుంది. ఆ తెరను తీసివేస్తే పెళ్ళికొడుకుకు పెళ్ళికూతురు, పెళ్ళికూతురుకు పెళ్ళికొడుకు కనిపిస్తారు. అలాగే నీ లోపల ఉన్న అహంకారం అనే పొరను తీసివెయ్యి, అప్పడు జీవుడు బ్రహ్మంలో ఐక్య మవుతాడు. ఆ తెరే అడ్డు, అహంకారం అనే తెరను కత్తిరించు, దేహబుద్ధి అనే తెరను కత్తిరించు. దానికి నువ్వు ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరుని సహాయం అందుతుంది. మీ శరీరం రంగు వేరు, నా శరీరం రంగు వేరు, మీ గుణాలు వేరు, నా గుణాలు వేరు కాని అందరిలోనూ అంతర్యామిగా ఉన్న పరమాత్మ ఒక్కడే. డబ్బు ఉన్నవారిని ధనవంతులు అంటాము, డబ్బులేని వారిని పేదవారు అంటాము కాని లోపల ఉన్న ఈశ్వరుడు ధనవంతుడు కాదు, పేదవాడు కాదు, ఆయన అందరిలో సమానంగా ఉన్నాడు, అంతటా వ్యాపించి ఉన్నాడు. ఇందుగలడు, అందులేడని సందేహము వలదు అని ప్రహ్లాదుడు చెపితే అయితే ఈ స్థంభంలో కూడా ఉన్నాడా అని హిరణ్యకశిపుడు అడుగుతాడు. అంతటా ఉన్నవాడు ఈ స్థంభంలో ఉండడా అన్నప్పడు, ఎక్కడ అని గద పెట్టి ఆ స్థంభాన్ని కొడతాడు, అప్పడు ఆ స్థంభంలోనుండి లక్ష్మీనరసింహస్వామి ఉగ్రరూపంతో వస్తాడు. అలా ఎందుకు వచ్చాడు అంటే ప్రహ్లాదుడి మాట నిజం చేయటానికి వచ్చాడు, భక్తుల మాటను గౌరవించటానికి వచ్చాడు, నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. మనలో అజ్ఞానం ఉన్నంతకాలం లోపల క్షోభ ఉంటుంది. నీకు జ్ఞానం సంపాదించాలనే తపన ముఖ్యం. మీరు పని ద్వారా భగవంతుడిని ఆరాధించండి. మీ ఇంట్లో ముసలివారికి భోజనం పెడుతున్నారు అనుకోండి ఈశ్వరుడికే పెడుతున్నాము

అనుకోండి, వారిని ఆరాధించాలి. పని ఇష్టంతో చేస్తే అది సేవ, ఇష్టం లేకుండా చేస్తే అది చాకిరి. దేశంలో కోట్లమంది జనం ఉన్నారు, అందరూ మన ఇంట్లో లేరు. పూర్వజన్మ సంబంధాన్ని బట్టి వారు మన ఇంట్లో సిద్ధమవుతారు, వారిని చూడమని భగవంతుడు మనకు కేటాయించాడు. అది ఇష్టంతో అనుభవిస్తే రాబోయేజన్మలో ఆ కర్మ రాదు. ఇంట్లో వారికి భక్తి ఇష్టం ఉండదు అనుకోండి, మనం భక్తి గురించి మాట్లాడకూడదు, లోపల మనం భక్తిని కాపాడుకోవాలి. వారు అన్నమాటకు తందానతాన అనేసి, మన పని మనం చేసుకొంటూ, లోపల భక్తిని పెంచుకోవాలి. మీ డబ్బును ఎంత రహస్యంగా ఉంచు కొంటున్నారో, మీ ఇంట్లో ఉన్న బంగారాన్ని ఎంత రహస్యంగా ఉంచుకొంటున్నారో అలాగే మీ భక్తిని అంత రహస్యంగా ఉంచుకోండి. మీరు నటించటం కూడా నేర్చుకోండి.

ఎప్పుడూ భగవంతుడు ఉన్నాడనే జీవించాలి. భగవంతుడు లేడని జీవిస్తూ ఉంటే తీరా భగవంతుడు ఉంటే మనం కష్టాలలో పడతాము. భగవంతుడు చెప్పిన మాటను మననం చేసుకోవాలి, ఆ మాటే బంగారం. ఇంట్లో పేచీలకు, బయట పేచీలకు కారణం అహంకారం. మన మాటలో అహంకారం ఉండకూడదు, మన చేతలో అహంకారం ఉండకూడదు. మన ఆలోచనలో, మన చూపులో అహంకారం ఉండకూడదు. నువ్వు ఏదైతే కాదో, అదే నేను అనే బుద్ధి నీకు ఉంది. ఆ బుద్ధిలో నుండి బయటకు రావటానికి నీ తెలివితేటలు సరిపోవు, నువ్వు చేస్తున్న స్నేహాలు సరిపోవు, నీకు ఉన్న చదువు సరిపోదు, భగవంతుని యొక్క దయ లేకుండా అందులో నుండి నీవు బయటకు రాలేవు. భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణం చేయండి, మననం చేయండి, ఆ మాటలు ఎందుకు చెప్పాడు అని విమర్శ చేసుకోండి. అంతేగాని ఇంట్లో ప్రతీదానికి తర్కానికి దిగకండి. మనిషి అయ్యాక పొరపాటు మాట రావచ్చు, ఆ మాటను పెద్దది చేసేసి పేచీలు పెట్టుకోవద్దు, వాదాలు పెట్టుకొని సంసారం పాడు చేసుకోవద్దు. మీరు ప్రతీ చిన్న విషయానికి భగవంతుడిని అడుగనక్కరలేదు. భగవంతుడితో మానసిక అనుబంధం పెట్టుకోండి, అప్పుడు మీ యోగక్షేమాలను ఆయనే చూస్తాడు. మీరు శాంతిగా ఉండండి, అక్కరలేని గొడవలలోనికి వెళ్లవద్దు. మీ జాగ్రత్తలో మీరు ఉండండి, అశ్రద్ధ పనికిరాదు. ఇతరులకు ఏదైనా సహాయం చేయగలశక్తి ఉంటే చెయ్యండి, చేసేశక్తి మీకు లేకపోతే వారందరూ క్షేమంగా ఉండాలని హృదయపూర్వకంగా భగవంతుడిని ప్రార్థించండి. దానివలన మనకు ఇహం ఉంటుంది, పరం ఉంటుంది. భగవంతుడి పాదాలను విడిచిపెట్టవద్దు. భక్తిని, వివేకాన్ని విడిచిపెట్టవద్దు.

**జూన్ నెలలో సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచనాలు ప్రారంభమవుతాయి. తేదీలు తరువాత తెలియపర్చబడును.**

## [illegible]

సాధన అంటే అభివృద్ధి దిశగా పయనించటం. లేనిది ఉన్నట్లుగా భ్రమింపజేసే భయంకరమైనది "మాయ". మనం ఈ మాయ మధ్యలో ఉండే జ్ఞాన ఖడ్గంతో దాన్ని ఛేదించుకొని వెళితే, మాయాతీత స్థితిలో ఉంటాము. పాము కోరలోని విషం పామును ఏమీ చెయ్యనట్లే, చైతన్యస్థితిలో ఉంటే "మాయ" మనలను బంధించదు. నిద్రలో సాధన లేదు, మెలకువలో "మాయ" ఒక తెరగా సత్య స్ఫురణ కలుగకుండా మన చూపుకు అడ్డు తగులుతోంది దానితో మనం మాయకు దాసోహమౌతున్నాము. కాబట్టి జీవితం అంతా ఆపదల్లోనే మునిగి ఉంటున్నామని భయపడుతూ ఉంటాము. కాని సద్గురు బోధ స్మరణకు వస్తే, అప్పుడే మనం స్వతంత్రులమని, ఆత్మ స్వరూపులమని గ్రహిస్తాము. "సాధన అంటే కంగారు పడకండి మన తలంపులు, చేసే పనులు దేహభావన పెంచకుండా ఉండాలి. ఇల్లు కట్టేటప్పుడు తాపీ, వడ్రంగి, తదితర పనివారితో చికాకు పడాలి, గృహ ప్రవేశంతో అన్నీ మర్చిపోయి హాయిగా ఉంటాము. అలాగే ఆత్మానుభవంలో అంతా సుఖమే" అన్నారు శ్రీ నాన్నగారు. నిజం చెప్పాలంటే కర్మలతో సంస్కరించబడ్డ హృదయం గలవారికి ఆత్మజ్ఞానం వెంటనే కలుగుతుంది. సాధకులు మూడు రకాలుగా ఉంటారు. 1. బాగా వేడిగా ఉన్న పెనం మీద ఒక నీటి చుక్క వేస్తే అది ఒక్క క్షణంలో శబ్దం చేసి మాయమౌతుంది. అంటే ఆధ్యాత్మిక విషయం విన్న వానికి ఒక్క క్షణం ఆనందించి మర్చిపోతాడు. 2. నీటిమీద ఉన్న తామరాకుపై నీటి బొట్టుగాలికి అటూ ఇటూ కదులుతూ ఆకుకు తడి ఏమాత్రం అంటుకొనకుండా సూర్యకిరణాలకు మంచి ముత్యంలా మెరిసిపోతూ ఉంటే, మనకు ఆశ్చర్యం, ఆనందం కలిగి, పరవశులౌతాము. అప్పుడే గాలికి ఆకు తిరగబడి ఆ నీటి బిందువు నీళ్ళలో కలసిపోతే అది నామ రూపాలు లేకుండా పోతుంది. అలాగే కొందరు ప్రవచనం విన్నంతసేపు ఆ ప్రాంగణంలో ఆత్మానందంతో పరవశించిపోతారు, ఇంటికి వచ్చిన వెంటనే బిడ్డ "అమ్మా" అనిగాని, తండ్రిని "నాన్నా" అనిగాని అంటే ఆత్మనందం కథ కంచికి వెళుతుంది. జీవలక్షణాలు పూర్తిగా ఆవరించి ఇంట్లో ఉండిపోతారు. 3. స్వాతికార్తిలోని వర్షపు చినుకును నోటబట్టుకొని ముత్యం తయారయ్యే వరకూ ఏకాగ్రతతో ఉండే జీవిలా, ఉత్తమ సాధకుడు, మనస్సుతో తనివి తీరా గురువుని నిరంతరం ధ్యానించి గురుపాదాలను తాకి, బ్రహ్మానుభవాన్ని పొందుతాడు, సాధన ఈ దిశగా సాగితే, సుఖ స్వరూపాన్ని పొందుతాము.

సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

# సంస్కారములు ఎవరికి?

గర్భాదానం, పుంసవనం, సీమంతోన్నయనం, జాతకర్మ, నామకరణం, అన్నప్రాశనం, బేలం, ఉపనయనం .... ఈవిధంగా 40 సంస్కారములు మరియు ఎనిమిది ఆత్మ గుణములు గౌతమసూత్రములందు వివరించబడినవి.

శ్రవణము, మననము, నిది ధ్యాసలు, నిత్యానిత్య వివేకము, ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము, శమాదిషష్క సంపత్తి, ముముక్షత్వము మున్నగు సాధనములు వేదాంత శాస్త్రములందు చెప్పబడినవి. అసుర సంపదను వదిలి, దైవ సంపదను పెంచుకోవాలని గీతయందు బోధించబడింది.

అసలు సంస్కారములు అనగానేమి? అవి ఎవరి కొరకు? సంస్కారముల వలన కలుగు ప్రయోజనమేమి అని బాగా విచారించినట్లయితే....

"సంస్క్రయతే జ్ఞానయోగ్యతా మాపద్యతే పురుషస్య చిత్తం అనేన ఇతి సంస్కారః"

పై క్రియల వలన జీవుని చిత్తము బ్రహ్మ విషయక జ్ఞానమును పొందుటకు యోగ్యమగునటుల సంస్కరించబడునో వాటిని సంస్కారములందురు. చిత్తశుద్ధియే సంస్కారముల యొక్క ఫలము. చిత్తశుద్ధి వలన జ్ఞానము, తద్వారా మోక్షము జీవునకు ప్రాప్తించును.

ఆత్మ నిరామయము, నిత్యము, శుద్ధము, అవ్యయము, జ్ఞానమయము కనుక ఆత్మకు సంస్కారములతో పనిలేదు. దేహము పాంచ భౌతికము, జఢము, అపరిశు ద్ధము, చర్మము, మాంసము, రక్తము, ఎముకలతో కూడినది. కావున ఎన్ని సంస్కారములు చేసినను నిష్ప్రయోజనమే కనుక దేహమునకు కూడా సంస్కారములతో పనిలేదు. మరి ఇంక సంస్కారములు ఆత్మకు గాక, దేహమునకు గాక జీవునకు మాత్రమే.

దేహేంద్రియాది జడపదార్థములందు అహంకార మమకారములు గల జీవాత్మ కొరకే సంస్కారములు అవసరము. దేహమే ఆత్మ అనే భ్రాంతి జీవునకు అజ్ఞానము, అవిద్య వలన కలుగుతున్నది. దీనినే అధ్యాసయని కూడా అంటారు. అది కాని దాని యందు అది అనే బుద్ధి అధ్యాస. దానిని తొలగించుకోవటానికే సంస్కారములు.

- బొప్పన అరుణాదేవి